# ఈ-కేవైసీ కోసం వినియోగదారుల బారులు

- రూ. 500 గ్యాస్ కోసమని ప్రచారం!
- కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ-కేవైసీ చేస్తున్నాం
- ఏజెన్సీల నిర్వాహకుల వెల్లడి

పోచమ్మమైదాన్, డిసెంబర్ 14: రేషన్ షాపుల మాదిరిగానే తాజాగా గ్యాస్ ఏజెన్సీల్లో ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) నమోదు కొనసాగుతున్నది. దీంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు బారులుదీరుతున్నారు. ప్రతి వినియోగదారుడికి సంబంధించిన కస్టమర్ ఐడీ, ఆధార్ నంబర్‌తో కార్యాలయ సిబ్బంది ఐరీష్, వేలి ముద్రలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 500కే గృహ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ఇచ్చేందుకే ఈ-కేవైసీ చేస్తున్నారని ప్రచారం జరుగుతుండడంతో ప్రజలు రోజూ ఉదయం నుంచి కార్యాలయాల వద్ద బారులుదీరుతున్నారు. ఎల్‌బీనగర్‌లోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉదయం 7 గంటల నుంచి క్యూ కడుతున్నారు. కొత్త సంవత్సరం నుంచి గ్యాస్ సిలిండర్లను తక్కువ ధరకు తీసుకోవచ్చనే ప్రచారం వైరల్ అవుతుండడంతో ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున గంటల తరబడి క్యూలో ఉంటున్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం ఈ-కేవైసీ చేస్తున్నామని, రూ. 500 గ్యాస్ సిలిండర్‌తో సంబంధం లేదని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నప్పటికీ చాలా మంది వినియోగదారులు ఈ-కేవైసీ కోసం ఎగబడుతున్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఈ-కేవైసీ తీసుకుంటున్నామని, దీని కోసం గడువంటూ ఏదీ లేదని ప్రీతి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మందల శ్రీనివాసరెడ్డి తెలిపారు.





ఎల్‌బీనగర్‌లో ప్రీతి గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు, ఈ-కేవైసీ చేస్తున్న సిబ్బంది(ఇన్‌సెట్‌లో)

# గర్భిణులు ఆందోళనకు గురికావొద్దు

- వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి
- డీఎంహెచ్‌వో కాజీపేట వెంకటరమణ

గిర్మాజీపేట, డిసెంబర్ 14: గర్భిణులు ప్రసవానంతరకాలంలో ఆందోళనలకు గురికావొద్దని డీఎంహెచ్‌వో కాజీపేట వెంకటరమణ అన్నారు. తన కార్యాలయంలో గురువారం గర్భిణులు ప్రసవానంతర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ఆత్మస్థైర్యంతో ఉన్న గర్భిణుల ప్రసవం సుఖవంతం అవుతుందన్నారు. ఎవరైతే ప్రసవానంతర సమయంలో చిరాకు, సరైన ఆహారం తీసుకోకవపోవడం, పురిటినొప్పుల భయం (టోకోఫోబియా) మందులు క్రమం తప్పకుండా వాడకపోవడం, వైద్యుల సలహాలు పాటించకపోవడం, దీర్ఘవాకాలిక వ్యాధులను నిర్లక్ష్యం చేసిన వారికి.. ఆ ప్రభావం పుట్టబోయే బిడ్డలపై పడుతుందని ఆయన హెచ్చరించారు. ఇలాంటి వారిపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారిని తగిన విధంగా మోటివేట్ చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు. కార్యక్రమంలో శిక్షకుడు డాక్టర్ భరత్‌కుమార్, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ పద్మశ్రీ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

# ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ఆందోళన

రాయపర్తి, డిసెంబర్ 14: ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఆరోపిస్తూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ఆందోళన చేసిన ఘటన గురువారం మండలంలోని గోప్యాతండాలో జరిగింది. బాధితురాలు గుగులోత్ సావిత్రి కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్యా ప్రతాప్, సావిత్రి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. డిగ్రీ వరకు చదివిన ప్రతాప్ హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సావిత్రి వ్యవసాయ పనులకు వెళ్తున్నది. వీరు రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెండ్లికి నిరాకరిస్తుండడంతో ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు స్పందించకపోవడంతో ప్రియుడు ప్రతాప్ ఇంటి ఎదుట తన కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగినట్లు సావిత్రి తెలిపింది. తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని బాధితురాలు చెప్పింది.



ఆందోళన చేస్తున్న సావిత్రి

# ‘కన్జ్యూమర్ రైట్స్ కమిషన్’ సెమినార్‌కు ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 14: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ‘ది నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్’ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సెమినార్‌కు కేయూ వీసీ తాటికొండ రమేశ్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వరంగల్ జిల్లా చైర్మన్ సాంబమూర్తి, తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ అనితారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పాండురంగ విఠల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వర్ ఆహ్వానపత్రాన్ని గురువారం అందజేశారు.



వీసీకి ఆహ్వానపత్రం అందజేస్తున్న సభ్యులు

## నేడు స్మారకోపన్యాసం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 14: మానవ హక్కుల పోరాట యోధుడు, కేయూ మాజీ ప్రొఫెసర్ కే బాలగోపాల్ 13వ స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని శుక్రవారం కామర్స్ సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ టీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మానవ హక్కుల కార్యకర్త ఏ చంద్రశేఖర్, వీసీ తాటికొండ రమేశ్, పరిశోధకులు, బోధనేతర, బోధన సిబ్బంది, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

## 17 నుంచి ధనుర్మాసోత్సవాలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 14: వరంగల్ మట్టెవాడలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని కోరారు.

## నడికుడలో బైక్, మోటర్ల చోరీ

నడికుడ, డిసెంబర్ 14: ఇంట్లో చొరబడి ద్విచక్ర వాహనం, కరెంటు మోటర్లను ఎత్తుకెళ్లిన ఘటన మండలకేంద్రంలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. నడికుడకు చెందిన గుర్రం కిరణ్‌గౌడ్ బస్టాండ్‌లో ఉన్న తన ఇంటిని వైన్ షాపుకు అద్దెకు ఇచ్చాడు. ఇటీవల కొత్త వైన్స్ రావడంతో ఇంటిని ఖాళీ చేశారు. ప్రస్తుతం ఆ ఇంట్లో ఎవరూ ఉండడం లేదు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు వరండాలో బైక్‌ను పార్కు చేశారు. అలాగే, రెండు కరెంట్ మోటర్లను ఇంట్లో ఉంచి మరో ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో దండగులు వాటిని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై రమేశ్‌నాయక్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల సీఐ వెంకటరత్నం తెలిపారు.

## కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

శాయంపేట, డిసెంబర్ 14: గట్లకానిపర్తిలో ప్రజ్వాల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారు గ్రామ ఫీల్డ్ ఫెసిలిటేటర్ కల్పన, జనశిక్షణ సంస్థాన్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం నవయుగ సొసైటీ అధ్యక్షుడు కోసరి గోపాల్ ప్రారంభించారు. 20 మంది మహిళలకు మూడు నెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రియంకారెడ్డి, సురేందర్, దేవేందర్‌రెడ్డి, హిమబిందు, సునీల్, తిరుపతి, గౌస్, ప్రశాంత్, మమతపాల్గొన్నారు.

# డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన పోటీలు

నర్సంపేటరూరల్, డిసెంబర్ 14: పట్టణంలోని ద్వారకపేట సంఘమిత్ర బాలభవన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బాలబాలికల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంఘమిత్ర యూత్ ఆర్గనేజేషన్ ప్రెసిడెంట్ గొంగళ్ల అశోక్ ఆధ్వర్యంలో ‘పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత’ అంశంపై డ్రాయింగ్ పోటీలు, బాలిక విద్య అంశంపై వ్యాసరచన, పర్యావరణం, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్, జనరల్ సైన్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 17న సంఘమిత్ర బాలభవన్ ప్రథమ వార్షికోత్సవంలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కొర్ర సారయ్య, శాంతికుమారి, కాంతారావు, టీచర్లు గడ్డం సుజాత, భిక్షపతి, కృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

శాయంపేట, డిసెంబర్ 14: మూడు రోజులుగా మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో నిర్వహించిన జోనల్ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో శాయంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(భూపాలపల్లి) విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆరు జిల్లాల నుంచి 60 పాఠశాలలు, 120 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. శాయంపేట గురుకుల విద్యార్థులు ‘పర్యావరణ సమస్యలు పరిష్కారం’ థీమ్‌లో కాలుష్య నివారణ యంత్రం ఎగ్జిబిట్‌ను ప్రదర్శించి జోనల్ స్థాయిలో తృతీయ బహుమతి పొందారని హెచ్‌ఎం తెలిపారు. ఈ మేరకు గైడ్ టీచర్ వసంత, విద్యార్థులను టీచర్లు అభినందించారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 14: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ హెచ్చరించారు. గురువారం కేఎంసీలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోదరభావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, కళాశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

నెక్కొండ, డిసెంబర్ 14: మహిళలు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎఫ్‌ఎంఎం సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ బెజ్జంకి ప్రభాకర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం రుద్రమదేవి గ్రామైక్య సంఘం సభ్యులకు ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ‘బాలల అక్రమ రవాణా, నిర్మూలన’ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలలు, మహిళల అక్రమ రవాణా అనేది చాలా క్రూరమైన, హేయమైన చర్య అని ప్రభాకర్ అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ దీన్ని వ్యతిరేకించాలని కోరారు. వ్యక్తులపై అనుమానం కలిగినప్పుడు 1098, 100 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు మార్త లావణ్య, కార్యదర్శి కరణకుమారి, కోశాధికారి హైమావతి పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ఖిలావరంగల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన ఘటన మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. శివనగర్ ఏసిరెడ్డినగర్‌కు చెందిన బైక్ మెకానిక్ మజ్జిగ సాయి(20), సింగిరెడ్డి రాహుల్(20) గంజాయి విక్రయిస్తున్నారు. విశ్వాసనీయ సమాచారం మేరకు గురువారం పోలీసులు తనిఖీ చేసి 3.50 కిలోల గంజాయి, 2 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మరో వ్యక్తి రాహుల్‌గుప్తా పరారీలో ఉన్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

## ‘ఈ ఏడాది నవలా పురస్కారాలు లేవు’

పోచమ్మమైదాన్, డిసెంబర్ 14: కొత్తగా నవలు రాసే వారిని ప్రోత్సహిస్తూ అందిస్తున్న నవలా పురస్కారాలను ఈ ఏడాది ఇవ్వడం లేదని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత, లిటరరీ ట్రస్ట్ అధ్యక్షుడు అంపశయ్య నవీన్ తెలిపారు. తన సతీమణి మృతి చెందిన బాధతో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24న తన పుట్టిన రోజు సందర్భంగా నిరాడంబరంగా తాను రచించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

**IN THE COURT OF THE FAMILY COURT, WARANGAL AT HANAMKONDA**

**O.P. No. 106 of 2022.**

Between:
Vallakatla Swathi ...Petitioner
And
Vallakatla Bharath ...Respondent

To
Vallakatla Bharath, S/o. Rajesh, Aged: 27 years, Occu: Auto Driver, R/o. H.No. 11-22-230, Kashibugga, Warangal.

**NOTICE**

The above named petitioner has filed the above Divorce O.P. under Section 13 (1) (i) (ib) of the Hindu Marriage, Act, 1955 against the respondent and the same is posted on 04-01-2024 at 10.30 A.M. for your appearance before this Hon'ble Court and you may be appeared either in person or through an advocate failing which the matter will be decided ex-parte.

"BY ORDER OF THE COURT"
Sd/- **THATIKONDA SADASHIVUDU**
Advocate,
R/o. H.No.10-8-101, Girmajipet,
Warangal.

## బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట, డిసెంబర్ 14: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురిని పరామర్శించడంతోపాటు శుభకార్యాలకు హాజరయ్యారు. సూరంపేటలో రిటైర్డ్ టీచర్, ఉద్యమకారుడు కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని మధుసూదనాచారి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, సీనియర్ నాయకుడు అడుప ప్రభాకర్, నిమ్మల మహేందర్, వెంకటేశ్, కిష్టయ్య ఉన్నారు.



కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి

## మంత్రి సీతక్కను కలిసిన టీఎన్జీవోస్ నేతలు

ఖిలావరంగల్: రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూర్య సీతక్కను వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, హేమానాయక్, రాజు, శంకేశి రాజేశ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సీతక్కకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు